# గెరిల్లా

పి. చంద్

మే మాసం ఎండ....నిప్పులు చెరుగుతాఉంది.... కనుచూపు మేరలో నీడన్నదెలేదు.... సముద్రము తలాపుకు పెట్టుకొని చాపనీళ్ళ కేడ్చిందంటే ఇదేనేమో ? అడివిలో నీడకోసము వెతుకులాట.... అది గొంతులెండిపోయి.... ఒక్కచుక్క నీటికోసము నోరు వెంపర్లాడుతున్నవేళ.... ఒక్కక్షణం ఆకులు రాల్చిన చెట్టుకిందనైన నిల్చుంటె ఎంతహాయిగా ఉండేది.... వీపుమీది "కిట్టి బ్యాగ్" మరింత కృంగదీస్తున్నది....భుజం మీది తుపాకి తాప తాపకు భుజాలు మార్చుకుంటేగాని కదలలేక పోతున్నారు. దానికి తోడు రెండు రోజుల నుండి తిండిలేదు.

ముందు నడుస్తున్న దళ నాయకుడు తన దళ సభ్యులకేసి చూసిండు.... అందరి మొఖాలు వాడిపోయినయి.... ముఖ్యంగా అందరికంటే చిన్నవాడైన రవి ఎర్రటి మొఖం పూర్తిగా నల్లబారింది....పెదవుల మీద వేడి పొక్కులా వచ్చినయి....అతన్ని చూస్తుంటే జాలికల్గింది.... అయితే అది ఎంతో సేపు నిలువలేదు....ముందుకు చూస్తు "కామ్రేడ్స్ గమ్యం దగ్గరికొచ్చింది అదిగో దూరంగా అగుపిస్తున్న బోడను సమీపించేంత వరకే" అంటు వాళ్ళను ఉత్సాహ పరిచిండు....అందరు ఒక్కసారి తమదళ నాయకుని వైపు చూసిండ్లు....నల్లటి మొఖం మరింత నల్లబడి చమట కక్కుతుంది....ముడుచుక పోయిన కనుగుడ్లలోకి చూసారు.... అవి సూటిగా స్థిరంగా ఉన్నాయి....

బాగా పరిచయమున్న దారంట వాళ్ళు నరాసరి కదిలిపోయిండ్లు.

---

అమర వీరుల త్యాగ మన్యధా పోదురా
పోరాట జ్వాలలూ పెల్లుబికి నాయిరా
ఆయుధము ధరియించరా....సోదరా
శత్రువుల వధియించరా
జనతంత్ర రాజ్యాన్ని స్థాపించరా ॥శ్రీకాకుళం॥

(శంఖారావం, విప్లవగేయాల సంకలనం నుంచి)

వాళ్ళను వెన్నంటి వస్తున్న "ఆంటీ నక్సలైట్ స్క్వాడ్" గూడెందాటి కాలిబాటంట అడివిలోకి వచ్చారు.... అకాలిబాటైనా పోనుపోను అదృశ్యమైంది.. చిన్నచిన్న గులకరాల్లు.... ఎటుపోవాలో తెలియక ఎస్. ఐ. కేసి చూసిండ్లు.... వెంటవున్న పోలీసులు.... ఎస్. ఐ. చిరుబురులాడుతున్నాడు.... ఆకాశంల సూర్యునైన చూడవచ్చేమోగానీ యస్.ఐ. మొఖంలోకి చూడటానికి పోలీసులు జంకిండ్లు.

"లంజ కొడుకులు పారిపోయిండ్లు" కోపమంతా ఎల్లగక్కిండు యస్.ఐ.... అతను మాట్లాడె ప్రతి నాలుగు మాటల్లో ఒక్కటి బూతు మాట వుతుంది.... అది అతనికి బాగా అలవాటయింది. అప్పుడప్పుడు తన క్రింద పని చేస్తున్న కానిస్టెబుల్స్‌కు కూడా అలవాటయింది.... కాకుంటే పై అధికారులు వచ్చినప్పుడు అతి విచిత్రంగా.... ఎంతో వినయం ఉట్టిపడేలా మారి పోతుంది అతని గొంతు....

యస్. ఐ. అడివి దున్నపోతులా ఉన్నాడు.... ఎండకు తడిసిన కాకీ బట్టలు శరీరానికి హత్తుక పోతున్నాయి. "చేతికిదొరికినట్టే దొరికిన షికార్ మళ్ళి అంతలోనే మాయ మయింది" మనసులోనే గుసుసుకున్నడు.... నామ పెట్టిన నక్కలా చూసిండు....ముందుకు పోదామంటే కాళ్ళల్లో వనుకుపట్టింది. మాదర్ చోత్‌గాల్లు ఎంతకైనా తెగించినోల్లు...." ఇంత దూరము చొచ్చుక రావటమే ప్రమాదం" అన్న ఆలోచన వచ్చే సరికి....ఎన్నుపొంటి వణుకు పుట్టింది.... ఎండిపోయిన టేకు ఆకుల మధ్య ఎదో సరసర కదిలిపోయినట్టు అలికిడి....

భయంతో బిక్క చచ్చిపోయిన పోలీసులు బొక్క బోర్లాపడి తుపాకులు సరిచేసుకున్నారు....అప్పటికే చిన్న ఒర్రెలోకి జారుకున్న యస్.ఐ. చప్పుడైన దిక్కుకు గుడ్డిగా ఓ రౌండు పేల్చిండు.... కళ్ళు తెరిచి చూసేసరికి చుట్టు ఏమి కన్పించలేదు మట్టి తప్ప....ఇంకాస్త తల పైకెత్తాలంటే భయం....ఉండి ఉండి తల కొద్దిగా పైకెత్తిండు ఒర్రెలోనుండి....అప్పడికే తమ యస్.ఐ. కోసము వెతుకుతున్న నాలుగు జతల పోలీసు కళ్ళు చూసి ఉక్రోషం కల్గి "క్యా దేక్‌రెహై....కిదర్‌గయా మాకెలపుడా" అరిచిండు....

"కోయి నహీ సాబ్.... చెవుల పిల్లి....ఇటు ఉరికింది" మూతి మీద మీసం లేని గడ్డపు తుర్కాయన అన్నడు....

"జానెదో కిదర్ జాతా....ఆ లంజ కొడుకులను ఒక్కొక్కన్ని కాల్చి వేస్తా...." అనన్నడు....

అలా అన్నప్పుడు ఒక్క క్షణం అతని మనసులో సర్కిల్ లింగారెడ్డి మెసిలిండు....ఇంట్ల ఉనోళ్లను కాల్చి చంపినందుకె రాష్ట్రపతి పతకం దొరికింది.... అటువంటప్పుడు అడివిలో వేటాడినందుకు....తప్పకుండా.... నిన్నగాక మొన్న చెన్నూర్ల హెడ్డు కానిస్టేబుల్ గానికి పదివేలు ఇచ్చింది ప్రభుత్వం.... ఆలోచిస్తుంటే నక్సలైట్లను చంపటమే ప్రమోషన్‌కు దగ్గరి దారిలా కనిపిస్తుంది.... అటువంటి అవకాశము వచ్చినట్టే వచ్చి చెయ్యి జారిపోతుందన్న కోపంలో....

"లంజ కొడుకులారా ఇంకేమి చూస్తారు వెనక్కిపద" అంటు కానిస్టేబుల్స్ మీద కసురుకున్నాడు....

ఆ ఎండలో తప్పడ తప్పడ బూట్లు ఆడించుకుంటు తుపాకులు సవరించుకుంటు గూడెంలకు వచ్చింద్రు పోలీసులు. దాహంతో గొంతెండిపోతుంది అందరికి.... మంచినీల్ల కోసము కేకవేస్తే.... ఒక్కరు గుడిసెలనుండి బయటికి రాలేదు.... అసలు గూడెంలో ఎవరు ఉన్నజాడే కనిపించటము లేదు.

యస్.ఐ. వచ్చి జీపులో కూసున్నాడు....వాటర్ బ్యాగెత్తి గటగట సగమన్ని నీల్లు తాగిండు....మిగిలింది కానిస్టేబుల్స్ గొంతులు తడుపుకున్నారు....

"గూడెంల ఉన్న లంజ కొడుకులను తీస్కరాండ్లి" ఆర్డరేసిండు. యస్.ఐ.

లెక్కకు పరంటే పదే ఉన్న గుడిసెలను చుట్టి రావటానికి పోలీసులకు పది నిముషాలు కూడా పట్టలేదు....

కంటికి నజరైన ఒక్క యువకుడు కన్పించలేదు....పిక్కబలమునోడు ఎవ్వడు గూడెంలలేడు.... ముడుతలు పడి చావుకు సిద్ధమైన ఓ ముసలోడు.... పుస్చు పుస్చుకుంటు వచ్చిండు....వాని పక్క మరో గుడ్డి ముసలోన్ని.... తీవ్రంగా జ్వరంతో బాధపడుతున్న ఓయువకున్ని పోలీసులు తీస్కవచ్చిండ్రు.... వాళ్ళను చూసిన యస్.ఐ. "ఆడోల్లను కూడా గుంజుకరాండ్లి" అని అరిచాడు.

బోరు బోరున ఏడుస్తుంటే గూడెంలోని ఆడవారినందరిని ఒక చోట కుప్పేసిండ్లు....నడుముల చుట్టుచుట్టుకున్న గుడ్డపేలికలు తప్ప రొమ్ములమీదేమీ ఆచ్ఛాదనలేదు....యస్.ఐ. అసహ్యంగా మట్టికొట్టుక పోయిన శరీరాల కేసి చూసిండు....చాల రోజుల నుంచి ఆకుపులు పట్టి తిర్గుతున్న పోలీసోల్లు నజర్ గల్ల అమ్మాయిలకేసి పట్టిపట్టి చూస్తున్నరు.

"లంజెల్లారా! మీ మొగోల్లంతా ఎటు పోయిండ్లే" యస్.ఐ.

ఎవరు సప్పుడు చెయ్యలేదు....

ఓ ముసల్ది దైర్యంచేసి "బంకకు అడవిలకు పోయిండ్లు గియాలప్పుడు ఎవరుంటరు బాంచెను"

"అడవిలకు పోయిండ్లానే లంజ.... పోరకలసార్లతో కల్సిపోలేదే" పోలీసోడొకడు కర్రతో ఒక పోటు పొడిచిండు,

ముసల్ది ఎందుకో కిక్కురుమనలేదు....మరి ఓపికలేకనో, అసహ్యంతోనో, మరి అలవాటుగానో....

"పార్టీ వాళ్ళు వస్తె.... ఎవరు తిండి పెట్టవద్దు తిండి పెడ్తె మక్కుర్గలి తన్ని జైల్ల పెడ్తం....గూడెం గూడెంను తగలబెడ్తం....వాళ్ళు వస్తే మాకు తెలపాలి" ఆడోల్లనుట్టు తిరుక్కుంటూ మధ్య మధ్య కర్రతో రొమ్ముల మీద పొడుస్తూ తిరిగిండు యస్.ఐ..

అప్పుడి దాక నిలబడలేక కూలబడ్డ యువకుని దగ్గరి కొచ్చిండు.... "నిల్సోరా లంజకొడుకా....నకురాలు చేస్తానాపురా"

"అయ్యా బాంచెను జ్వరమొచ్చి చాతనయితలేదు" అంటు లేవటానికి ప్రయత్నించి కూలబడిపోయిండు....

"లేరా....మంచిమాటకులే" యస్.ఐ,

అయినా లేవలేదా యువకుడు.

ఎండలో తిర్గిన కోపమో, మరేమో కాని.... యస్.ఐ. కర్రతో అదే పనిగా కొట్టడము మొదలు పెట్టిండు....

అది చూస్తు ఆడోల్ల బోరున ఏడ్చిండ్లు.... ఆ అలజడికి చెట్ల మీద పక్షులు భయంతో పారిపోయినయి..

ఆ యువకుడు మాట పలుకు లేకుండా స్పృహ కోల్పోయిండు., యస్.ఐ సూచన మేరకు ఆ తర్వాత పోలీసులు ఆ యువకున్ని జీబులో వేసుకొని కదిలిండ్లు.

జీబు గూడెం దాటి లొద్దిలో ఉన్న వాగు దగ్గరికి వచ్చేసరికి.... అడివంత దద్దరిల్లేలా ఒక్కటే మోత తుడుం మోత....

జీబు తొందరగా పోనిచ్చే తొందరలో వచ్చి సుర సుర కాలుతున్న నడి వాగులో ఆగింది....ఫోర్ వీలర్స్ కూడా పనిచేయకుంటయింది.. అందరు దిగి జీబు నెట్టే ప్రయత్నంలో ఉన్నారు....

అంతకంతకు తుడుం మోత.... గుండెల్లో మోగుతుంది.. భయం ఆవరించింది.. అయాసంగా రొప్పుతున్న పోలీసులకు వాగుకు రెండు వైపులా జనం.... కర్రలుగుతుపలు పట్టుకొని....ఎక్కడి నుంచివచ్చిండ్లో ఏమోగాని.... ఎక్కడ చూసినా పట్టుమంటే పది మంది కన్పించని అడివిలో అంత మంది క్షణాల మీద ఎలా పోగయ్యారో అర్థం కాలేదు యస్. ఐ.కి.

తుడుం మోతింకా విన్పిస్తూనే ఉంది..

జనం ఇంకా వస్తున్నారనటానికి నిదర్శనంగా పోలీసుల చుట్టు ముసురుకున్న తలలు అంతకంతకు ఎక్కువవుతున్నాయి....

పోలీసులకు సన్నగా వెన్నుపొంటి వనుకు మొదలైంది.

"ఎవరైనా అడుగు ముందేసెదుంటే కాల్చేస్తాను" యస్. ఐ. గొంతు తడారి పోతుంటే....గొంతును ఎవరో పట్టిపిసుకుతాంటే మాటలు రాక మాట్లాడినట్లు మాట్లాడిండు....ఆపత్కర పరిస్థితిలో కూడా పోలీసులు తమ అధికారి వింత గొంతుకకు విచిత్రంగా చూసిండ్లు.... కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు మొఖంల....

అంతలోకే....

"పోలీసుల దౌర్జన్యం నశించాలి" అడివి దద్దరిల్లేలా నినదించారు చుట్టు మూగిన గిరిజనులు...

ఇంద్రవెల్లిలో జరిపినట్టు.... కనిపించినవారినల్లా పిట్టల్లా కాల్చేయాలని పించింది యస్.ఐ.కి. కాని వెనక్కి తిర్గి చూసుకుంటే నాటి ఇంద్రవెల్లిలోలాగా మందలకు మందలు పోలీసులు కన్పించలేదు.... బిక్కు బిక్కు మంటున్న

నాలుగు పోలీసు మొఖాలు.... వాళ్ళ మీదికి దునకటానికి సిద్ధంగా ఉన్న పులుల తీర్గ జనం కోపంగా చూస్తున్నారు.. యస్.ఐ.కి హఠాత్తుగా పెండ్లాం పిల్లలు ఏడుస్తున్నట్టుగా స్ఫురణ కొచ్చింది.....

"ఇంతకు మీకేం కావాలి" ఎలాగో మాటలు పెకిలించుకొని యస్.ఐ. అన్నాడు....

"అరెస్టు చేసిన మా కామ్రేడ్‌ను విడుదల చేయాలి"

"లేకుంటే" యస్.ఐ....

"ప్రాణాలతో ఎవరు ముందుకు పోలేరు" నరిగెలాగ పొడవుగా సాగ బారినట్టున్న గిరిజనుడు సుర్రున ముందుకు కదిలి అన్నడు.

"ఈ లొద్దిలోనే పూడ్చేస్తాం" మరో వైపు నుండి వచ్చింది....ఎవరన్నది అర్థం కాలేదు.... యస్.ఐ.కి వాళ్ళను చూస్తుంటే నిజంగానే వాళ్ళ అన్నంత పని చేసేలా ఉన్నారనిపించింది.. నాడు ఇంద్రవెల్లిలో తుపాకి గుండ్లకు లెక్క చేయక గుర్రున తన పక్క నుండి గిద గిద ఉరికొచ్చి కస్సున డి.ఎస్.పి. మీదికి గొడ్డలి విసిరిన గిరిజనుడి మొఖంలా తనచుట్టు ఉన్న ముఖాలు అదే మాదిరిగా కన్పించినయి ఒక్క క్షణం,

"సరె విడ్చిపెడ్తాం....దారివ్వండి"....అన్నాడు చివరికి ఎలాగో

ఆ తర్వాత....

జీబు వాగులోంచి బయటికొచ్చింది....అరెస్టు చేసిన యువకున్ని జీపు నుండి కిందికి దించారు. పోలీసులు బిక్కు-బిక్కు మంటు ముందుకు కదిలి పోయారు....పోతూ....పోతూ యస్. ఐ. తుపాకీతో ఒక్కనైనా కాల్చాలని పించింది. కాని పన్నెండు మైళ్ళంటా అడవిలో ప్రయాణం....ఎక్కడ ఏ క్షణంలోనైనా మళ్ళీ దాడి జరగచ్చు....రేసు కుక్కల మాదిరి....కుప్పకుప్పలుగా వచ్చి మీద పడ్తే....అనె జాసకు రాగానే మళ్ళీ తుపాకిని యదా విధిగా సర్దుకున్నాడు.... "ఎక్కడికి పోతరు లంజకొడుకులు ఒక్కొక్కన్ని తూట్లు తూట్లు పొడవను" అనుకున్నాడు,

స్పృహ కోల్పోయిన యువకున్ని ఎత్తుకొని నినాదాలు చేసుకుంటు గిరిజనులు కదిలిపోయిండ్లు....

० ० ०

గుట్టబోడు మీదకి సురక్షిత స్థావరానికి చేరుకున్న తర్వాత....దళ కమాండర్ అందరిని సమావేశపరిచిండు "ఇప్పుడింకా మనల్ని వెన్నంటి శత్రువు వస్తున్న జాడలింకా లేవని" నిర్ధారించుకున్నారు....సెంట్రీని పెట్టుకొని....నీళ్ళ కోసము బయలు దేరిండ్లు....బాగా అలసిపోయిన "రవి" ఓ రాయి నీడన కూచున్నాడు....వగరుస్తూ....

బాగా పరిచయమున్న ఆబోడు మీద నీటి గుంట ఎక్కడుందో ఎరిగున్న కామ్రేడ్ ముందుకు నడుస్తుంటే అతన్ని అనుకరించి పోయిండ్రు మరిద్దరు....

నీటి గుంట చుట్టు ఉన్న చెట్లు ఆకులు రాల్చటము వలన నీరంతా ఆకులతో నిండి పోయి పచ్చటి పాకురు పేరుకుంది....మరో సారి అయితే ఆనీళ్లను చూస్తేనే డోకువచ్చేది కాని.... దాన్నెంతో అపురూపంగా త్రాగారువాళ్ళు.... దాంతో వాళ్ళకు కొంత ఊరట కల్గింది....తిర్గివచ్చి వాళ్ళంతా నిద్దురపోయిండ్లు.. దాదాపుగా అందరు సొమ్మసిల్లినట్టుగా ఉన్నారు.

సెంట్రీ తనకు అనువైన స్థావరంలో కూచొని అడవిలోని ప్రతికదలికను కనిపెడుతున్నాడు.

కొద్దిగా తేరుకున్న తర్వాత దళనాయకుడు లేచి సెంట్రీ డ్యూటీకి బయలు దేరిండు...."కామ్రేడ్ నీవెళ్ళి విశ్రాంతితీసుకో"అన్నాడు ఇంతవరకు సెంట్రీని. కడుపులో ఆకలి నకనకలాడింది మొన్న సాయంకాలము అన్నం తిన్న సంగతి గుర్తు కొచ్చింది.

ఆరోజు ఓ గిరిజన గ్రామం వెళ్ళారు....అన్ని గ్రామాలలాగే అదికూడా చిన్నగ్రామమే.... పది పదిహేను గుడిసెలున్నాయి పశ్చిమాన దాదాపు ఇరువై కిలో మీటర్ల దూరము అడివిగుండాపోతే "కాగజ్‌నగర్" అనే పట్టణం తగులుతుంది· వానాకాలములో కొద్దిగా గూడెం చుట్టు ఉన్న చెలకలను దున్నుతారు. అదికూడా అడివి జంతువులు నాశనము చేసిందే కాక తాలుతప్పలు పోతె మిగిలింది రెన్నెల్లు పొద్దు గడుస్తుంది. మిగతా కాలమంతా అడివి మీదె బ్రతకాలి. అడివిలో దొరికే తునికి, రేగుపండ్లు పట్నానికి తెచ్చుకుంటారు. అవేవి దొరకనప్పుడు అడివిలో కంక బొగ్గులు కొట్టి పట్నానికి తీసుకెళ్తారు. అది కూడా ఫారెస్టు వాళ్ళ కంటపడిందో మళ్ళీ ఇంటికొచ్చేదుండదు. కేసులుపై ళ్ళ

ఉన్నాయి వాళ్ళకోసము. అందుకోసము వాళ్ళు పొద్దున్నే లేచి అడివిలో తిర్గి కంక బొంగులు సేకరించుకొని రాత్రి రెండు జాములకు బయలుదేరి పూర్తిగా చీకటి తొలగకముందే పట్నానికి చేరుకొని అక్కడి కార్మిక (గుడిసె) వాడల్లో తెల్లారెసరికి దర్శనమిస్తుంటారు. ఒక్కొక్క మోపుకు పది పదిహేను బొంగు లుంటాయి. అవి అమ్ముకోగా వచ్చె ఏడు ఎనిమిది రూపాయలతో ఇంటికి తిర్గి వచ్చేటప్పుడు జొన్నలో సూకలో తెచ్చుకోవటము ఆతెచ్చుకున్నాయి ఆపూట వండుకొని తిని తెల్లారి పిల్లలకు కొద్దిగా మిగిల్చి మళ్ళీ బొంగుల కోసము తిర్గి అడివికి పోవడము వాళ్ళ నిత్యకృత్యం....అదికూడా ఫారెష్టువాళ్ళ దృష్టిలో పడకుండేనే....అయినా మధ్య మధ్య ఫారెష్టు వాళ్ళు గూడెంలకు వచ్చి కోళ్ళ మేకలు ఎత్తుక పోతుండేవారు.

ఎప్పుడైతే ఆ ప్రాంతములో గిరిజన రైతు కూలి సంఘాలు బలపడి ఫారెష్టువాళ్ళ జులుంకి వ్యతిరేకంగా పోరాడటం జరిగిందో....అప్పటినుండి వాళ్ళ జులుం తగ్గింది. ఈ మధ్య కాలములో బిర్లా కంట్రాక్టర్లు కాగితపు పరిశ్రమ కోసము కంక బొంగుల కొరకు అడివిని గుత్తకు తీసుకోవటము.... గిరిజనులను కూలీలుగా మార్చింది. దాంతో తక్కువ కూలిరేట్లకు వ్యతిరేకంగా పోరాటం జర్గుతుండటం....ఆసందర్భంగానే మొన్న ఆ గ్రామాన్ని చేరటము జర్గింది.

సాయంకాలము చీకట్లు ముసురుకుంటున్న వేళ. గ్రామం చేరుకున్న ప్పుడు గ్రామస్తులంతా పార్టీ వాళ్ళు వచ్చిండ్లని తెలియగానె, బంగ్లాకాడ గుమి కూడిండ్లు....అ వూరి పటేల్ బదేరావు "రాం రాం" పలుకుతు వచ్చి....కూలి రేట్ల గురించి జర్గుతున్న పోరాటం గురించి చెప్పుకొచ్చిండు....

"100 మోపుకు ఐదు రూపాయల నుండి ఏడు రూపాయలు ఇచ్చేందుకు ఒప్పుకుంటాడు కాని తొమ్మిదికి తగ్గేటలెదని మేము ఒప్పుకోలె" అన్నాడు ఉత్సాహంగా....

"అదైనా ఓమానాన విన్నాడా....పోలీసులను తీసుకొచ్చి పనుల్లోకి వస్తారా లేకుంటే జైల్లకు పోతారా అని బెదిరించిండు" అన్నాడు జంగు ముందు కొచ్చి....

"మాకు కూలి గిట్ట నప్పుడు మేము ఈ కూలి చేసేం భాగ్యం చెయ్య కేమి భాగ్యం" అన్నాడు భీమ్‌రావు అలా అన్నప్పుడు అతను వింతగా తలాడించిండు.... అడివిలో తలమీద గుద్దెలుగు కొట్టిన కాడినుంచి అతనికా వింత రోగము అలవాటయింది.

వాళ్ళ మాటలన్ని విన్న తర్వాత "మీరు సంఘటితంగా ఉంటే తప్ప కుండా విజయం సాధిస్తాం...."

"ఏమో సారు వీళ్ళు లొంగి వచ్చేలా లేరు" అన్నాడు అనుమానంగా భీమ్‌రావు....

"మొట్టమొదట ప్రతి ఒక్కడు అలాగే బెట్టుచేస్తాడు వీలైనంత మేరకు దోచుకోవాలనే చూస్తాడు....మనమింకా కొద్ది కాలము సంఘటితంగా ఉండి ఇలాగే పోరాడితే తప్పకుండా విజయం సాధిస్తాం....కోట్లు ఆర్జించి పెట్టే కాగితపు పరిశ్రమను బిర్లావాడు మూయించుకోలేడు కదా! అది కూడా మన మెంతో న్యాయమైన రేటునే అడిగాము...."

మౌనంగా వాళ్ళంతా మాటలు ఆలకిస్తున్నారు....వాళ్ళను మరింత ఉత్సాహ పరిచేందుకు "ఇది వరకు మనం ఫారెష్టు అదికార్ల "జులుం"కు వ్యతిరేకంగా పోరాడినప్పుడు మనకు ఇదే సమస్య ఎదురైంది....వాళ్ళకు వ్యతిరేకంగా పోరాడి నిల్వగలమా అని? కాని మనం సంఘటితంగా ఫారెష్టువాళ్ళ జులుంకి వ్యతిరేకంగా ఎదుదు నిల్చినప్పుడు వాళ్ళతోక ముడిచిండ్లు....మనం న్యాయం కోసము పోరాడుతున్నాము కాబట్టి మన విజయం సాధిస్తాం...." ఆ మాటలకు వెంటనే బదులుగా....

"అవును ఫారెష్టు వాళ్ళ మునుపటిలా జులుం చెలాయిస్త లేరు" అన్నాడు చీకట్లో కూచున్నతను....ఆ చీకట్లో అతను స్పష్టంగా కన్పించలేదు.

"అవును ఈరోజు ఫారెష్టు కంట్రాక్టర్లకు వ్యతిరేకంగా కూలి పెంపు కోసము పోరాడుతున్నాము....వాళ్ళ తప్పకుండా లొంగివస్తారు....అంతే కాదు మన సమస్యలు అన్ని తీరాలంటె భూమి కావాలి....మనం దున్నుకునేందుకు భూమిలేనంత కాలము మన సమస్యలకు పరిష్కారముండదు....ఇప్పటికి చాల గ్రామాలల్ల భూమికోసము పోరాటము జరుగుతున్నది....అడివిని నరికి భూమిని

సాపు చేసుకుంటున్నరు....పంటలు పండించు కుంటున్నరు....మీరు కూడా అడివిని నరకాలి....భూమిని సాగులోకి తెచ్చుకోవాలి"

భూమి మాట వినగానె అందరి మనసుల్లో కొత్త ఆశలు చిగుర్చాయి....

"అయితె మేం కూడా అడివిని నరుకుతాం"

"తప్పకుండా నరకాలి....తొలకరి చినుకులు పడేసరికి భూమిని సాపు చేసుకోవాలి"

"పోలీసులు వస్తే"

"వారికి వ్యతిరేకంగా పోరాడాలి....అప్పుడే మనం భూమిని దక్కించు కోగలము"

వాళ్ళ మనసుల్లో గూడుకట్టుకున్న భయాలను ఒకొక్కటే వాళ్ళు బయట పెట్టిండ్లు....వాటన్నిటికి ఓపిగ్గా సమాదానాలు చెప్పేసరికి అప్పటికే చాల పొద్దు బోయింది....అందరి కడుపుల్లో అకలి నక నక లాడింది....అందరు వెళ్ళి పోయేందుకు సిద్ధమైయిండ్లు.... ఓ బక్కపలచని వాడు.... "మీరీ రాత్రి మాయింటికి భోజనానికి రావాలి దాదా" అన్నాడు....అంతవరకు అతను ఒక్క మాటయినా మాట్లాడలేదు.

"లేదు లేదు మాయింటికి తీస్కపోతా" అన్నాడు బీమ్‌రావు యథావిదిగా తలాడిస్తూ.

"ఎవరింటికి వద్దు మాఇంటి కాడె అన్ని ఏర్పాట్లు చేసిన" అన్నాడు పటేలు బదేరావు....

కాని కరువు కాలములో ఒకరింటనె దళము మొత్తంగా తిండి పెట్టటము కష్టమే....ఒకవైపు ఆకలి తీర్చుకోవటం కోసము గునుగు గింజలు....ఓంద్ర కాయలు మరియు అడివిలో దొరికె విషపూరితమైన దుంపలు విషం పోయేంత వరకు నీళ్ళలో నానబెట్టుకొని పొట్ట నింపుకుంటున్న కరువుకాలములో.... కష్టమేమరి "సరె మిమ్మల్ని నారాజు పరచుటమెందుకు ...మాదళ సభ్యులు ఒక్కొక్కరింటికి ఇద్దరేసి చొప్పున వస్తాము" అని అందరిని సంతృప్తి పరచాలని అన్నాను.

వాళ్ళందుకు ఒప్పుకున్నారు.

తను, అందరికంటే చిన్నవాడు రవి కల్సి కొత్తగా భోజనానికి పిల్చిన అతని వెంట వెళ్ళారు....అతని పేరు హన్మంతు....అతను తోవ పొడుగుతా.... మాట్లాడుతూనే ఉన్నాడు.... తన రెండు తల్లిలేని పిల్లమేకల గురించి.... వాటి తల్లిని ఫారెష్టు వాళ్ళు చంపుకొని తిన్న సంగతి కొన్నించి మొదలుకొని అడివిలో పుల్లలేరుకోవటము ఇదివరలో ఎంత కష్టమైందో....తన రెండు దున్నలు షావుకారు ఎలా వశపరుచుకున్నది....చెపుతూనే ఉన్నాడు.... అది మొత్తంగా ఒక్క హన్మంతు బాధే కాదు మొత్తం గిరిజనుల బాధ....వినే ఓపిక ఉంటే ప్రతి గిరిజనుని జీవితము ఒక కన్నీటి సముద్రము....

గుడిసె ముందు మంచము వాల్చి కూచోమన్నడు....అకాశంల నెలవంక తూర్పు దిక్కుగా ఎగబాకుతుంది....మసక వెలుతురు గూడెంకు అస్పష్టమైన ఆకారాన్నిస్తుంది గూడెం చుట్టు ఉన్న అడివి చిక్కటి నల్లరంగు పూసినట్టుగా ఉంది....ఆ మసక వెన్నెల్లో చెట్ల పైకొసలు చీకటికి వెలుతురుకు మధ్య సరిహద్దు రేఖ లాగున్నాయి.

మంచములో కూసున్నకాడికె రెండు రాతెండి కంచాల్లో అన్నము తెచ్చి చేతికిచ్చిండు....ముద్దకారము....కొద్దిగా పప్పు....నిజంగా అపురూపమే ఆభోజనము....రవి ఆవురావురు మంటు ముద్దలు కలుపుతున్నాడు....

"హన్మంతు మరి నీవు తినవా" అన్నాను అన్నము కలుపుకుంటు....

"మీరు తినండి సారు....మేము తర్వాత తింటాము" అన్నాడతను.

"అదే అందరము కల్సి తిందాము" అన్నాను మళ్ళి

"కంచాలు వేరె లేవన్నా....మీరు తిన్నాంక మేం తింటాము" అంది గుడిసెలో నుంచి హన్మంతుభార్య....

మాటవచ్చిన వైపు దృష్టిసారిస్తే గుడిసె దర్వాజ కాడ నిలుచున్న చిన్న అస్పష్టమైన ఆకారము కనిపించింది... దిసమొలగా ఉన్న మూడు నాలుగేండ్ల పిల్లవాడు మావైపే పరీక్షగా చూస్తున్నట్టు కనిపించాడు.

"రా బాబు" అని పిలిచాను.

వాడొక క్షణంసేపు వస్తామా? వద్దా అన్నట్టు తటపటాయించిండు.... మళ్ళీ రమ్మనిపిలిచిన తర్వాతగాని మేము కూచున్న మంచము కాడికిరాలేదు....

మసక వెన్నెల వెల్గులో సన్నటి పుల్లలాంటి కాళ్ళు చేతులు ఆడించుకుంటు దగ్గరగా వచ్చిండు....

"నీ పేరు" అన్నాను మచ్చిక చేసుకుందామనే ఉద్దేశంతో....

బదులేమి పలుకకుండా నేను కలుపుతున్న అన్నము ముద్దకేసి చూస్తుండి పోయిండు....

"బువ్వ తింటావా" అన్నాను....

ఆఁ అన్నట్టుగా.... గుడిసెకేసి, తండ్రికేసి చూసిండు.... హన్మంతు "ఇంట్లోకి పోబిడ్డా అవ్వ అన్నము పెడ్తది" అంటు దగ్గరికి తీసుకొనేందుకు ప్రయత్నించిండు....కానిఆ పిల్లవాడు మంచము కోడును పట్టుకొని కదల్లేదు....

"పర్వాలేదు ఉండనియ్" అంటు మంచము మీద పక్కగా కుచుండ బెట్టుకున్నాను.... నేనో ముద్ద అన్నము నోట్లో పెట్టుకొని పిల్లవాడి చేతులో మరో ముద్ద పెట్టాను. వాడు చపుక్కున నోట్లో పెట్టుకొని బాగా ఆకలిగా ఉన్నా డేమో మళ్ళీ చెయ్యి సాపిండు....

హన్మంతు మేకలను కట్టేసేందుకు ఎగ్గుకాడికి పోయిండు....

"బువ్వ తిన్లేదా" అన్నాను.

లేదన్నట్టు తలూపిండు....

"అదేఁ అవ్వ అన్నము పెట్టలేదా?"

"పొద్దటి సుండి అమ్మ....నాన బొంగులు అమ్మకరాను పోయిండు వచ్చినంక వండి పెడ్తానంది.... బువ్వ అయినంకనో....సార్లు తిన్నంక పెడ్త నంది....నాక్తో ఆకలి బాగా అయితంది" అన్నాడు వచ్చీరాని మాటలతో.... నాకా మాట లింటుంటే కండ్లపొంటి నీళ్ళు జల జల కారినయి....అన్నము తింటున్న రవి నోట్లోని ముద్ద నోట్లనే ఆగిపోయింది....

మేకను కట్టేసి వచ్చిన హన్మంతు "రా బిడ్డా ఎత్తుకుంటాను అంటు చేయిసాపిండు" మా దగ్గరి నుండి తీసుకపోయే ఉద్దేశంతో....

"పర్వాలేదు ఉండనియ్ హన్మంతు" అంటు వారించాను అప్పటికే మారవి ఆపిల్లవాన్ని తనతొడమీద కూచుండబెట్టుకొని..అన్నముకల్పి ఆపిల్లవాడి నోట్లో పెడుతున్నాడు....

"ప్రజలే నిజమైన విప్లవకారులు" అన్న మావో సూక్తి నా బుర్రలో మెదిలింది.... రవి మొఖంలోకి చూస్తే సరిగ్గాఅతను నాలాగే ఆలోచిస్తున్నట్టుగా అనిపించింది ఆ మసక చీకట్లో....

అది మొన్న జరిగిన సంఘటన....నిన్నటి రోజుంతా ప్రయాణము ఇవ్వాళ ఉదయమే మరో ఊళ్ళో భూస్వామి అక్రమంగా ఆక్రమించుకున్న భూమి గురించి ప్రజా పంచాయతి. పంచాయతి జర్గుతుండగానే....ఊళ్ళోకి పోలీసులు వస్తున్న సంగతి సెంట్రీ కనిపెట్టిండు....జాగ్రత్త కోసము హెచ్చరికలు సాగినయి....మరో వైపు నుండి తిరోగమించాల్సి వచ్చింది....బహుశా పోలీసులకు భూస్వామియే సమాచారము అందించి ఉండాలి.... లేదా మరేదో కారణం ఇంత వరకు ఏ సంగతి తెలియదు.... ఆ విషయమింకా పరిశీలనలో ఉంది.. అక్కడి నుంచి పారిపోయి ఇక్కడికి వచ్చిన సంగతి గుర్తుకొచ్చింది....

కామ్రేడ్స్ వైపు చూసాను దాదాపుగా అందరు నీరసపడిఉన్నారు.. ఆకలి అందరిని దహించివేస్తున్నది....కడుపులో ఏదైనా పడ్తెగాని కదలలేని స్థితిలో ఉన్నట్టు అన్పించింది..

దళము మొత్తంగా చూస్తే అర్ధసేరు....జొన్నలున్నాయి.... అవిఅయినా ఎంతో కంట్రోలుగా వాడితేనే మిగిలినవి....అది తప్ప తినేందుకు మరొకటి లేదు....

"కామ్రేడ్స్ మనమీ పూట ఇక్కడే భోజనము చేసి బయలుదేర్తె బాగుంటుందేమో....మీ అభిప్రాయము" అడిగాడు కమాండర్ అందరికేసి చూస్తు....

"అలాగే కామ్రేడ్" నల్లగా లావుగా ఉన్న దళ సభ్యుడు అన్నాడు.... అతను రైతు కామ్రేడ్. నలుబై సంవత్సరాలుంటాయి కావచ్చు దళములో అందరికంటె పెద్దవాడు....లేచి ఎండు పుల్లల కోసము కదిలిండు....సహాయం కోసము ఇంకో కామ్రేడ్ లేస్తె ..."పర్వాలేదు కామ్రేడ్ నీవు విశ్రాంతి తీసుకో అడివి అడివంతా ఎండిపోయివుంది....నిముషములో పట్టు కొస్తాను" అంటు వారించి ముందుకు కదిలిండు....

నిప్పు రాజేసుకున్న తర్వాత గిన్నెలో ఉన్న కాస్త జొన్నలు పోసి.... అవే పాకురుపట్టిననీళ్ళు పోసిండ్లు....ఆకలికి అందరి నోళ్ళల్లో నీళ్లూరినయి....

ఎత్తైన స్థలములో తనకు అనువైన స్థలంలో కూచున్న సెంట్రీ....అడివి నాలుగు చెరుగులా కళ్ళు పొడుచుకొని చూస్తున్నాడు....అతని దృష్టి నుండి ఏ ఒక్కటీ తప్పుకోవడములేదు చెట్టు, పుట్ట, తుప్ప....పక్షి....ఎక్కడ ఏ అలికిడి ఆయినా కనిపెట్ట గల్గేలా తన యావద్శక్తి కండ్లల్లో నింపుకొని చూస్తున్నాడు....

పొయ్యిమీద మక్కజొన్నలు తుకతుక లాడుతున్నాయి.

దూరాన ఎక్కడో పీడ కదిలింది.

కదిలిన నీడవైపు మెడ సారించిండు సెంట్రీ....ఎత్తుగా పెరిగిన ఎండి పోయిన టేకుచెట్ల మాటున ఏదో కదిలివస్తున్న దృశ్యము....పరీక్షగా చూస్తే మందలా వస్తున్న కాకిబట్టల పోలీసులు కన్పించిండ్లు. ఎటువైపు పోతున్నది కనిపెట్టిండు మరింత పరీక్షగా.... అంతవరకు చెట్ల చాటునుండి ఫారెస్టు వాళ్ళు ప్లాంటేషన్ కోసము వదిలిన మైదానముల కొచ్చిండ్లు....ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నారు....మొత్తము పన్నెండుమంది ఉన్నారు. ఇద్దరు ఇనస్పెక్టర్‌లలా గున్నారు. వాళ్ళకు ముందు భాగాన ఎవరో తెల్లబట్టలాయన నడుస్తున్నాడు.... ఎవరైంది స్పష్టంగా కనిపించటంలేదు....వారి వెనుక పోలీసులు తుపాకులు పొజిషన్‌లో పట్టుకొని వస్తున్న దృశ్యం కళ్ళబడింది. వాళ్లు తామున్నవైపే వస్తున్నట్టుగా గుర్తించి పాములా రాళ్ళమాటున పాకి దళమున్న చోటి కొచ్చిండు.

వచ్చేసరికి....

అప్పుడే దించిన గిన్నెలో వేడివేడిగా మక్కజొన్న గుడాలు....అందరి నోట్లు నీళ్ళూరిస్తున్నాయి....ఆవురావురుమంటూ ఆకలిచే దహించివేస్తున్న వారికి వాటిని చూడగానే ఆకలి మరింత పెచ్చరిల్లింది. ఎవరితట్లు వాళ్ళపట్టుకున్నారు.

"వీటికి కాస్తకారము....ఉప్పు కలుపుకుని ఉల్లిగడ్డ అంచుకు పెట్టుకుంటే బలేపసందుగా ఉంటాయి" ఉడికి ఉబ్బి ఉన్న పసుపుపచ్చని మక్కలను చూస్తు గుటకలు మింగుతూ ఓ కామ్రేడ్....

"డియర్ కామ్రేడ్ ఉప్పులేక వారంరోజులైంది" అన్నాడింకో కామ్రేడ్ కాస్త నిరుత్సాహ పరుస్తూ

"కొద్దిగా కారపుపొడి అయినా పసందే" అన్నాడు ఇందాకటి కామ్రేడ్, అందరు నవ్వుకున్నారు.

వాళ్ళ మాటలిన్న సెంట్రీ....పొంచిఉన్న ప్రమాదము గురించి తెలియ పర్చాలి....తప్పదు....అనుకొని దళ కమాండరును సమీపించి "ఇటువైపే పోలీసులు వస్తున్నారు కామ్రేడ్" అన్నాడు శాంతంగా.

అందరు ఒక్కక్షణం నిశ్చేష్టులై గంభీరులైండ్లు....క్షణాల మీద వాళ్ళు యుద్ధానికి సిద్ధమైండ్లు రైఫిల్సు సరిచేసుకుంటు. కమాండరు సెంట్రితో రాళ్ళను మాటుచేసుకొని కదిలిండు దూరంగా బోడును సమీపిస్తున్న పోలీసులు కనిపించిండ్లు....నిదానించి చూస్తే సరిగ్గా వాళ్ళు బోడును సమీపిస్తున్నట్టేఉంది. తిరిగి దళాన్ని సమీపించేసరికి అప్పుడికే వాళ్ళంతా సామాను సర్దుకొన్నారు. అసలెప్పుడు అక్కడ మానవసంచారమేలేన్నట్టుగా సర్దిండ్లు....అంతవరకు వంట చేసుకోవడమువల్ల ఏర్పడ్డ బూడిదైనా మిగలకుండాచేసి కమాండర్ ఆజ్ఞకోసము తయారుగున్నారు.

"కామ్రేడ్ మనం వెంటనే ఇక్కడి నుంచి రిట్రీట్ కావాలి" ఆతను ఆజ్ఞాపించిందే తడవు.

ఎవరి సామాను వాళ్ళు భుజాన వేసుకున్నారు....
వేడిగిన్నింకా పొగలు కక్కుతూనే ఉంది....

దానివైపు ఒక్కక్షణం విచార దృక్కులతో చూసిన రైతు కామ్రేడ్....దాన్ని పట్టుకోవటానికి చెయ్యిసాపిండు. అది సురుక్కుమంది. తువ్వాలతో దాన్నిఒడిసి పట్టుకొని వాళ్ళతోపాటు కదిలిండు....

పశ్చిమ దిక్కున వంగిన సూర్యుని వేడికిరణాలు మొఖము మీద పడుతుంటే వాళ్ళు బోడువెనుకవైపు నుండి దట్టమైన అడవుల్లోకి ప్రయాణము సాగించిండ్లు....

సూర్యాస్తమయంఅయ్యే వరకు వాళ్ళ ప్రయాణము అలా కొనసాగుతూనేఉంది. పశ్చిమాన ఆకాశము నెత్తురు కక్కుతుంది. సంధ్య వెలుగు కూడా అస్తమించింది. చిక్కటి చీకటి చెట్ల మాటునుండి నలుచెరుగులా వ్యాపిస్తుంది. ఎక్కడో దూరాన జంతువుల అరుపులు విన్పిస్తున్నాయి. అలసిపోయి అందరు ఆయాసంగా కాళ్లతీసి కాళ్ళువేస్తున్నారు.

అంతవరకు గిన్నెను చేతితో పట్టుకున్న కామ్రేడ్ ఎండిన ఆకులను చుట్టగా మల్చి నెత్తిమీద పెట్టుకున్నాడు. ఎండిపోయిన సెలయేటి ఇసుకలో

## నా ప్రియమిత్రులారా

చిన్న

నేనా విశాల ప్రాంగణాల నుండీ
లోతైన స్వేచ్ఛ నుండి
భ్రమల గాజుగదిలోకి వచ్చానీ రోజు
అందుకే
పాటల్ని పారేసుకు వెతుకుతున్నా
మాటల్ని మరిచి వెంపర్లాడుతున్నా
చరిత్ర నిండుగా
ఎర్రని రక్తం మరకల్లో నా వాళ్ళను
పోగొట్టుకున్నానని విలపిస్తున్నా
కాని నేస్తం

---

కూరుకపోతున్న పాదాలను ఈడ్చుకుంటు నడుస్తు....కాలుకేదో తగిలి ఒక్కసారిగా తూలిండు....ఆ ఊపుకు నెత్తిమీది "గిన్నె" ఇసుకలో దొర్లింది.... అందులో గింజలన్ని ఇసుకలో కల్సినయి....

అందరూ ఒక్కక్షణమాగిండ్లు.

కమాండరు చుట్టూ కలియజూసిండు....చాల దూరము వచ్చామని గ్రహించిండు. చీకట్లో శత్రువింకా చొచ్చుకొస్తాడన్న నమ్మకములేదు. ఇప్పడికే శత్రువు తిరుగుప్రయాణం సాగించు తుంటాడని నిర్ధారించుకొని కొద్దిసేపు అక్కడ విశ్రాంతి తీసుకోవటం ఏమంత ప్రమాదము కాదనుకొని "కామ్రేడ్స్ కాసేపు విశ్రాంతి తీసుకొని బయల్దేరుతాము" అన్నాడు.

మౌనంగా అందరు "సరె" అన్నారు.

సెంట్రీ డ్యూటీ మీదికెక్కిన కామ్రేడ్ సెలయేటి గట్టుమీద తుప్పల మధ్య తనకు అనువైన స్థలము నుండి చీకట్లను చీల్చుకుంటు చూస్తుండి పోయిండు....

చల్లటి ఇసుకలో కూలబడిపోయిన మిగతా కామ్రేడ్స్‌లో....ఆకలి దప్పిక నీరసము ఒకదానికి ఒకటి పోటీ పడుతున్నాయి. ఆ చల్లటి ఇసుకలో దొర్లి పోయిన గింజలను చేతులతోతడిమి ఒక్కొక్క గింజనే గిన్నెలో వేస్తున్నాడు.